క్లుప్తంగా

నర్తకులకు సత్కారం



నాట్య ప్రదర్శన చేసిన చిన్నారులు

సామర్లకోట: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నృత్యకారులను ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త అల్లక్కి శ్రీనివాసరావు దంపతులు సత్కరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన చిన్నారులు ఆదివారం కార్తికమాసాన్ని పురస్కరించుకొని నృత్య ప్రదర్శనలు చేశారు. వారికి శ్రీనివాసరావు దంపతులు భోజన ఏర్పాట్లు చేసి సత్కరించారు.

విభిన్న ప్రతిభావంతులకు ఉపాధి



సమావేశంలో మాట్లాడుతున్న సుజాత

సామర్లకోట: విభిన్న ప్రతిభావంతులకు రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి కల్పిస్తోందని మెప్మా సిటీ మిషన్ మేనేజర్ సుజాత అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా పట్టణ పరిధిలోని విభిన్న ప్రతిభావంతులను ఈ సందర్భంగా మెప్మా ఆధ్వర్యంలో ఆదివారం సత్కరించారు. మహిళా సంఘాల మాదిరిగా దివ్యాంగులతో సంఘాలను ఏర్పాటు చేసి వారికి బ్యాంకుల నుంచి రుణాలు అందజేయనున్నట్టు తెలిపారు. ఆయా రంగల్లో వారికి శిక్షణ ఇచ్చి చిరు వ్యాపారాలు చేసుకోవడానికి సహకారం అందిస్తామని తెలిపారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు



ప్రమాదంలో గాయపడిన హరి

సామర్లకోట: కాకినాడ కెనాల్ రోడ్డు రైల్వే గేటు వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు కథనం ప్రకారం కాకినాడ నుంచి సామర్లకోట వస్తున్న కారు, సామర్లకోట నుంచి కాకినాడ వెళుతున్న మోటారు సైకిళ్లను ఢీ కొంది. దాంతో మోటారు సైకిల్‌పై ప్రయాణిస్తున్న కాకినాడ ఇంద్రపాలేనికి చెందిన గుండు హరి గాయపడ్డాడు. ట్రాఫిక్ ఎస్సై క్షతగాత్రుడిని 108లో కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కారు టైర్ పంచర్ కావడంతో అదుపు తప్పి ఈ ప్రమాదం జరిగినట్టు పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పంచారామ క్షేత్రంలో జ్యోతిర్లింగార్చన



లింగాకారంలో వెలుగుతున్న జ్యోతులు

సామర్లకోట: కార్తిక మాసంను పురస్కరించుకుని స్థానిక పంచారామ క్షేత్రమైన శ్రీబాలా త్రిపుర సుందరీ సమేత కుమార రామభీమేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి జ్యోతిర్లింగార్చన ఏర్పాటు చేశారు. ఆలయంలో లక్ష పత్రి పూజలు చేసుకున్న భక్తులు జ్యోతిర్లింగార్చనలో దీపాలను వెలిగించారు. ఆలయ దీపారాధన సంఘం ఆధ్వర్యంలో జ్యోతిర్లింగార్చన ఏర్పాటు చేశారు.

ఆకట్టుకున్న గాత్ర కచేరీ



సుధా రఘునాథన్

బోట్‌క్లబ్: సరస్వతి గాన సభ 120వ వార్షిక సంగీత, నృత్య నాటకోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి సూర్యకళామందిరంలో సంగీత కళానిధి చెన్నైకు చెందిన సుధా రఘునాథన్ గాత్ర కచేరీ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. ముత్తయ్య భాగవతార్, అన్నమాచార్య కీర్తనలు ఆలపించి అందరినీ అలరించారు. కచేరీకి వయోలిన్‌పై ఎంబర్ కణ్ణన్, మృదంగంపై అక్షయ అనంత పద్మనాభన్, ఘటంపై ఆర్.రామన్, తంబురపై రాజ్యలక్ష్మి సహకారాన్ని అందించారు. తొలుత ఈ ఉత్సవాలను ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ విశ్రాంత వీసీ ఐవీ రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇవటూరి సన్యాసిరావు, రాజ్యలక్ష్మి, కొమ్మిరెడ్డి శ్రీరామ నరసింహారావు పాల్గొన్నారు.

300 మందికి వైద్య సేవలు

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్ వద్ద అపెక్స్ ఈఎన్‌టీ ఆస్పత్రి వద్ద డాక్టర్ కందుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో సుమారు 300 మందికి చెవి, ముక్కు, గొంతు, భుజం, మోకాలు సంబంధ వైద్య సేవలు అందించారు. స్వాతి హియరింగ్ కేర్ సెంటర్‌కు చెందిన శ్రీనివాస్ నాయక్, రాజమహేంద్రవరానికి చెందిన స్పెషలిస్టు డాక్టరు దీపక్ నూకల వైద్య సేవలందించారు.

ఉత్సాహంగా వన సమారాధనలు

- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- కాపు కల్యాణ మండపానికి స్థలం కేటాయిస్తాం : దొరబాబు



దవులూరి దొరబాబును సత్కరించిన నిర్వాహకులు

సామర్లకోట: కార్తికమాసం అందులో ఆదివారం కావడంతో పట్టణంలో చాలా చోట్ల వనసమారాధనలు నిర్వహించారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రం ఆవరణలో కాపు వనసమారాధన ఏర్పాటు చేశారు. అక్కడి ఉసిరి చెట్టు వద్ద, వెంకటేశ్వరస్వామి ఆలయంలోను నిర్వాహకులు పూజలు చేశారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, జనసేన నియోజకవర్గ కన్వీనర్ తుమ్మల బాబు, భారతమాత సేవా పరిషత్ అధ్యక్షుడు గొరకపూడి చిన్నయ్యదొర, దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు, పారిశ్రామిక వేత్త పడాల సంజీవి, తోట సుబ్బారావునాయుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోట కూర సాయిరామకృష్ణ, జెడ్పీటీసీ సభ్యురాలు ఎలిశెట్టి అమృత, మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ తదితరులు పాల్గొన్నారు. కాపులు విద్యపై దృష్టి సారించి ఉన్నత స్థానాలను చేరు కొవాలని పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా ముఖ్య నాయకులను నిర్వాహకులు సత్కరించారు. పట్టణంలో విశాలమైన స్థలంలో కాపు కల్యాణ మండపం నిర్మాణానికి స్థలం కేటాయిస్తామని దవులూరి దొరబాబు అన్నారు. కల్యాణ మండపం నిర్మాణానికి తన వంతు విరాళంగా రూ.10 లక్షలు అందజేస్తానని గొరకపూడి చిన్నయ్యదొర ప్రకటించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక పోటీలు నిర్వహించి విజేతలకు ఎంతగానో అలరించాయి. వివిధ పోటీలోని విజేతలకు దొరబాబుతో పాటు పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మద్దాల శ్రీను తదితరులు బహుమతులు అందజేశారు.

టీటీడీసీలో బ్రాహ్మణ వన సమారాధన

స్థానిక టీటీడీసీలో పట్టణ పరిధిలోని బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన నిర్వహించారు. అక్కడి ఉసిరి చెట్టుకు వారు పూజలు చేసి ఆటలు, పాట పోటీలను నిర్వహించారు. అంతా సహపంక్తి భోజనాలు చేశారు. బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు చీమలకొండ ప్రసాద్, సంఘ సీనియర్ నాయకుడు సీసీఎస్ రాజుల ఆధ్వర్యంలో పెద్దలను సత్కరించారు. అనంతరం సంఘ సమావేశం నిర్వహించారు. అదే విధంగా పెద్దాపురం ఏడీబీ రోడ్డులోని రిలయన్స్ పవర్ ప్లాంటు గెస్టు హౌస్ ఆవరణలో కమ్మ కార్తిక వన సమారాధన నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు బిక్కిన పరమేశ్వర సాయి ఆధ్వర్యంలో ఉసిరి చెట్ల వద్ద పూజలు చేసి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.



బ్రాహ్మణ సంఘ కార్తిక వన సమారాధనలో చిన్నారుల నృత్య ప్రదర్శన

ఐక్యతకు దోహదం



చేనేత కార్తిక వన సమారాధనలో మాట్లాడుతున్న హౌసింగ్ చైర్మన్ దవులూరి

పెద్దాపురం: కుటుంబాల్లో ఐక్యతను చాటేందుకు కార్తిక వన సమారాధనలు దోహదపడతాయని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. పట్టణంలో ఆదివారం 25వ చేనేత వర్గాల వన సమారాధనకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చేనేతలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ ముప్పన శ్యామలాంబ, దేవాంగ సంఘం నాయకులు జెట్టి రాజబ్బాయి, తూతిక నూకరాజు, చల్లా బ్రహ్మాజీ, తూతిక రాజు, కౌన్సిలర్లు పేరింశెట్టి అంబిక, కట్టా రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో వైఎస్సార్ సీపీ విజయం



తిరుపతికి పాదయాత్రగా వెళ్తున్న దొరబాబు

- హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి
- నాలుగో రోజు కొనసాగిన పాదయాత్ర

పెద్దాపురం: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో విజయానికి నాంది పలుకుతాయని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. వైఎస్సార్ సీపీ విజయం సాధించాలని కోరుతూ ఏడు పర్యాయాల పాటు నిర్వహించ తలపెట్టిన పాదయాత్ర ఆదివారం సామర్లకోట నుంచి పెద్దాపురం మండలం తిరుపతి స్వయంభూ శృంగార వల్లభ స్వామి ఆలయానికి సుమారు 15 కిలో మీటర్ల మేర సాగింది. జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు ఆవాల లక్ష్మీనారాయణ, సామర్లకోట వైస్ చైర్మన్ ఊబా జాన్ మోజెస్, ఏఎంసీ వైస్ చైర్మన్ బండారు వీరబాబు, గృహ సారథుల మండల కన్వీనర్ గోపు మురళి, కౌన్సిలర్ దూది రాజు, ఇడుసుమళ్ల సాయి, నల్లల గోవిందు, సుందరెడ్డి రాజు, పార్టీ కార్యకర్తలు, అభిమాలతో కలిసి దవులూరి యాత్ర చేపట్టారు. ఆలయ ఈఓ పులి నారాయణమూర్తి, ఆలయ చైర్మన్ కర్రి జగదీష్, ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజు ఆలయ వేద పండితులు ఆలయ మర్యాదలతో వారికి ఘన స్వాగతం పలికారు. జగన్‌మోహన్ రెడ్డి మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రజల సేవలో మరో 20 ఏళ్లపాటు సీఎంగా కొనసాగాలని వారు ప్రత్యేక పూజలు చేశారు. హౌసింగ్ చైర్మన్ దొరబాబు మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి సారథిగా ప్రజలందరి గుండెల్లో సుస్థిర స్థానం సాధించిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. వర్గాలకు అతీతంగా సంక్షేమ పాలన అందిస్తూ జగన్ ప్రజల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఒబిలిశెట్టి అబ్బాయి, వాసిరెడ్డి శ్రీనివాస్, తుమ్మల అచ్యుతరామయ్య, లక్కాకుల కృష్ణ, నాగబోయిన రాజుబాబు, ఎద్దుకుమార్, బోనాసు గుర్రాజు, మలపరెడ్డి లోవ తదితరులతో పాటు అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

బీచ్‌రోడ్డులో రాకపోకల నిలిపివేత



బీచ్‌రోడ్డులో రాకపోకలు నిలిపివేసిన పోలీసులు



ఏకే మల్లవరంలో రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

కొత్తపల్లి: మిచాంగ్ తుఫాన్ కారణంగా తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ స్వామినాయుడు అన్నారు. ఉప్పాడ బీచ్ రోడ్డులో ఆదివారం పర్యటించిన ఆయన స్థానిక మత్స్యకారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. సముద్రపు అలలు ఉవ్వెత్తున ఎగసి పడుతున్న కారణంగా బీచ్ రోడ్డులో రాకపోకలు నిలిపివేశారు. తీరంలో ఉన్న మత్స్యకారులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు రెవెన్యూ అధికారులతో కలిసి సహాయక చర్యలు తీసుకుంటామన్నారు. ఉప్పాడ బీచ్ రోడ్డు సెంటర్, సూర్యరావుపేట, నేమాం వద్ద బీచ్ రోడ్డులో రాకపోకల నిలుపుదలకు భారీ బారికేడ్లు ఏర్పాటు చేశామన్నారు. పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. స్థానిక మత్స్యకారులు ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందించాలన్నారు.

పిఠాపురం: తుపాను నేపథ్యంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో రైతులు జాగ్రత్తలు పాటించి అప్రమత్తంగా ఉండాలని గొల్లప్రోలు వ్యవసాయ శాఖాధికారి సత్యనారాయణ సూచించారు. ఆయన ఆదివారం గొల్లప్రోలు మండలంలో పర్యటించారు. ఈసందర్భంగా ఖరీఫ్ కోతలు పూర్తయ్యి కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలన్నారు. వరి కుప్పలకు బరకాలతో రక్షణ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారని, తేమ శాతం ఎక్కువ ఉన్నా కొనుగోలు చేస్తారన్నారు.

మళ్లీ జగన్ సీఎం కావాలని 2 వేల మంది పాదయాత్ర



గొల్లప్రోలు నుంచి అన్నవరం వరకూ పాదయాత్ర నిర్వహిస్తున్న గ్రామస్తులు

పిఠాపురం: రాష్ట్రంలో సుపరిపాలన కొనసాగించేందుకు మళ్లీ జగన్ సీఎం కావాలని కోరుతూ కాకినాడ జిల్లా గొల్లప్రోలు నుంచి అన్నవరం వరకూ ఆదివారం 2 వేల మంది పాదయాత్ర నిర్వహించారు. గొల్లప్రోలు విజయదుర్గా అమ్మవారి ఆలయ కమిటీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి మొగలి బాబ్జీ ఆధ్వర్యంలో సాగిన ఈ పాదయాత్రకు దారి పొడవునా ప్రజలు ఘన స్వాగతం పలికారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలన్నా, పాడి పంటలు సమృద్ధిగా ఉండాలన్నా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ సీఎం కావాలని, అందుకే పాదయాత్ర నిర్వహించామని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి మొగలి బాబ్జి తెలిపారు. కార్యక్రమంలో పలువురు భక్తులు, 2 వేల మంది స్థానికులు పాల్గొన్నారు.



పాదయాత్ర చేస్తున్న మహిళలు

జిల్లా క్రీడల్లో శాంతివర్ధన విద్యార్థుల ప్రతిభ



విజయకేతనం చూపిస్తున్న శాంతివర్ధన విద్యార్థులు

పెద్దాపురం: ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవంలో భాగంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన క్రీడల్లో మండలంలోని పులిమేరు శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపర్చినట్లు డైరెక్టర్ రాయవరపు వీరబాబు తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో తమ పాఠశాల నుంచి 30 మంది విద్యార్థులు పాల్గొన్నారని, వీరిలో 29 మంది ఆయా విభాగాల్లో ప్రతిభ కనబరిచారన్నారు. ప్రథమ స్థానంలో తొమ్మిది మంది, ద్వితీయ స్థానంలో ఆరుగురు, తృతీయ స్థానంలో 15 మంది వెరసి 29 మంది ప్రతిభ కనపర్చినట్లు వీరబాబు తెలిపారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన విభిన్న ప్రతిభావంతుల వేడుకల్లో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, డీఎల్‌డీఓ పాటంశెట్టి నారాయణ మూర్తి చేతుల మీదుగా వారు బహుమతులు అందుకున్నట్టు ఆయన తెలిపారు.

ప్రతి విద్యార్థికీ 'నవోదయం'

- ఏఎస్పీ శ్రీనివాస్, డిప్యూటీ కలెక్టర్ భానుప్రకాశ్‌రెడ్డి
- ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



అల్యూమీట్‌లో ప్రసంగిస్తున్న ఏఎస్పీ శ్రీనివాస్

పెద్దాపురం: నవోదయ సేవలను సద్వినియోగం చేసుకుంటూ ప్రతి విద్యార్థీ ఉన్నత స్థాయికి ఎదగాలని ఏఎస్పీ పి.శ్రీనివాస్, డిప్యూటీ కలెక్టర్ భాను ప్రకాష్‌రెడ్డి అన్నారు. స్థానిక జవహార్ నవోదయ విద్యాలయలో ఆదివారం అల్యూమీట్ పేరిట పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఆర్.కమలం అధ్యక్షతన జరిగిన సమావేశంలో పూర్వ విద్యార్థులు ఏఎస్పీ శ్రీనివాస్, డిప్యూటీ కలెక్టర్ ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ నవోదయ విద్యాలయలో చదివిని ప్రతి విద్యార్థికీ మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. నాడు తాము చదివిన విద్య ఈ రోజు అదే విద్యాలయలో ఓ ఉన్నత స్థానంలో నిలబడేలా చేసిందన్నారు. అనంతరం విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. వారితో ముఖాముఖి నిర్వహించి ఉదయం నుంచి సాయంత్రం వరకు 1998–22 వరకు చదివిన పూర్వ విద్యార్థులు సరదాగా గడిపారు. విద్యాలయ వైస్ ప్రిన్సిపాల్ కె.రామకృష్ణయ్య, ఇంగ్లిష్ పీజీటీ సత్యనారాయణ, పీఈటీ సత్యనారాయణ, అధ్యాపక సిబ్బంది, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఇదేమి చోద్యం!

- కంపోస్టు యార్డుగా పిఠాపురం రోడ్డు
- మున్సిపల్ వాహనాల్లో చెత్త డంప్
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



సామర్లకోట-పిఠాపురం రోడ్డులో ఏలేరు కాలువ సమీపంలో చెత్తను వదలుతున్న పారిశుధ్య సిబ్బంది

సామర్లకోట: పది మందికి ఆదర్శంగా నిలబడాల్సిన వారే తప్పు చేస్తే.. మిగిలిన వారి పరిస్థితి ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. స్థానిక పిఠాపురం రోడ్డు కంపోర్టు యార్డుగా మారిపోయింది. రోడ్డు పొడవునా చెత్తతో నిండిపోవడంతో పాటు దుర్వాసన వస్తోంది. ఇంటింటా చెత్త సేకరించడానికి ఇటీవల మున్సిపాలిటీకి ప్రత్యేక పారిశుధ్య వాహనాలను ప్రభుత్వం అందజేసింది. వాటిలో చెత్త సేకరించే సిబ్బంది పిఠాపురం రోడ్డులో ఏలేరు కాలువ వద్ద వేసేస్తున్నారు. దాంతో ఆ రోడ్డులో రాకపోకలు సాగించే ప్రజలు ముక్కుమూసుకుని వెళ్లాల్సి వస్తోంది. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ప్రచారం చేసే మున్సిపాలిటీ వాహనంలో ప్రజల నుంచి సేకరించిన చెత్తను రోడ్డు మార్జిన్‌లో వేయడం ఏమిటని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. ఇటీవల కాలంలో పిఠాపురం రోడ్డులో జనావాసాలు పెరుగుతున్నాయి. ఇప్పటికే ఉప్పువారి సత్రం ఎదురుగా టిడ్కో గృహ సముదాయం పూర్తయింది. రెండో విడతలో ఆ ప్రాంతంలో జగనన్న ఇళ్ల స్థలాలు ఇచ్చే అవకాశం ఉంది. ఏలేరు కాలువ నిత్యం పారుతూ ఆహ్లాదకరంగా ఉండే ప్రదేశంలో చెత్తను వేయడం వల్ల దుర్వాసనతో ప్రజల ఆరోగ్యానికి హాని కలుగుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీ వాహనాల్లో చెత్తను రోడ్డు మార్జిన్‌లో వేయడంతో.. ఆయా ప్రాంతాల వారు సైతం వ్యర్థాలను రోడ్డు మార్జిన్‌లో వేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మార్జిన్లను శుభ్రంగా ఉంచాలని కోరుతున్నారు.

కంపోస్టు యార్డుకు తరలించేలా చర్యలు



పట్టణంలో ప్రజల నుంచి సేకరించిన చెత్తను మున్సిపాలిటీకి చెందిన కంపోస్టు యార్డుకు తరలించే విధంగా చర్యలు తీసుకుంటాం. మినీ వాహనాల్లో సేకరించిన చెత్తను ట్రాక్టర్ల ద్వారా తరలించే ఏర్పాట్లు చేస్తాం. పిఠాపురం రోడ్డులో చెత్త వేస్తున్న వారిపై చర్యలు తీసుకోవడానికి పారిశుధ్య కార్మికులతో సమావేశం నిర్వహించి, తగిన సూచనలు ఇస్తాం. పిఠాపురం రోడ్డులో ఉన్న చెత్తను తొలగించేలా చర్యలు తీసుకుంటాం. – జె.రామారావు, మున్సిపల్ కమిషనర్, సామర్లకోట

తీరంలో కొనసాగుతున్న 'పసిడి' వేట



ఉప్పాడ తీరంలో బంగారం కోసం వెతుకుతున్న స్థానిక మత్స్యకారులు



ఒక మహిళకు లభ్యమైన బంగారు రేకులు

కొత్తపల్లి: మండలంలోని ఉప్పాడ శివారు పాత మార్కెట్ సమీపంలోని తీర ప్రాంతంలో గత రెండు రోజులుగా సాగుతున్న పసిడి వేట కొనసాగుతుంది. ఆదివారం స్థానిక మత్స్యకార కుటుంబాలకు చెందిన మహిళలు, చిన్నారులు బంగారం కోసం జల్లెళ్ళతో ఇసుకను జల్లెడ పడుతున్నారు. ఇప్పటికే మహిళలకు బంగారు రేణువులు, రూపులు, చెవిదుద్దులు, ఉంగరాలతో పాటు పలు బంగారు, వెండి వస్తువులు లభ్యమయ్యాయి. గతంలో పెద్ద పెద్ద బంగ్లాలు, పలు దేవాలయాలు సముద్రగర్భంలో కలిసిపోయాయని, వాటిలో ఉన్న వస్తువులు తుఫాన్ సమయంలో బయటపడుతున్నాయని మత్స్యకారులు చెబుతున్నారు. తుఫాన్‌ను సైతం లెక్కచేయకుండా వెతుకుతున్నారు.

స్విమ్మింగ్ పోటీలలో అభిషై ప్రతిభ

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా స్విమ్మింగ్ సంఘం ఆధ్వర్యంలో వాకాడ గ్రీన్‌ఫీల్డ్ ఇంటర్‌నేషనల్ స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి స్విమ్మింగ్ ఎంపికల్లో కాకినాడకు చెందిన డీవీకే అభిషై ప్రతిభ కనపరచి పలు విభాగాల్లో పతకాలు సాధించాడు. అండర్–13 విభాగంలో 100 మీటర్ల బ్రెస్ట్‌స్ట్రోక్, బటర్‌ఫ్లైలో బంగారు పతకం, 400, 200 మీటర్ల ఫ్రీస్టైల్‌లో రజత పతకం అందుకున్నాడు. స్థానిక లిటిల్ ఫ్లవర్స్ స్కూల్‌లో ఆరో తరగతి చదువుతున్న అభిషైను డీఎస్‌డీఓ శ్రీనివాస్‌కుమార్, స్విమ్మింగ్ సంఘ కార్యదర్శి రాజు అభినందించారు.

ట్రాఫిక్ కష్టాలకు చెక్

- పూర్తయిన కొండయ్యపాలెం ఫ్లైఓవర్
- ముత్తా గోపాలకృష్ణ వారధిగా నామకరణం
- సీఎంతో ప్రారంభించేందుకు సన్నాహాలు



నిర్మాణం పూర్తి చేసుకున్న కొండయ్యపాలెం ఫ్లైఓవర్



అభివృద్ధి పనులు జరుగుతున్న జంక్షన్

కాకినాడ: ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న కొండయ్యపాలెం ఫ్లై ఓవర్ ప్రారంభోత్సవానికి సిద్ధమవుతోంది. 14 ఏళ్ల ట్రాఫిక్ కష్టాలకు మోక్షం కలగనుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దీనిని ప్రారంభించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కొండయ్యపాలెం రైల్వేగేటు వద్ద ట్రాఫిక్ కష్టాలను దృష్టిలో ఉంచుకుని 2009లో ఈ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. జగన్‌మోహన్ రెడ్డి సీఎంగా అధికారం చేపట్టాక ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఈ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో స్థానికుల కష్టాలు గట్టెక్కనున్నాయి.

రూ.50 కోట్లతో నిర్మాణం

కొండయ్యపాలెం ఫ్లై ఓవర్ పనులను రూ.50 కోట్లతో పూర్తి చేశారు. ఇందులో రూ.40 కోట్ల వరకు భూసేకరణకే వ్యయమైంది. సర్వీస్ రోడ్ల నిర్మాణంలో ఎదురైన సాంకేతిక ఇబ్బందులతో ఇప్పటికీ జాప్యం జరుగుతోంది. వీటిని అధిగమించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టారు.

ముత్తా గోపాలకృష్ణ వారధిగా..

నిర్మాణం పూర్తిచేసుకున్న ఈ ఫ్లై ఓవర్‌కు ముత్తా గోపాలకృష్ణ వారధిగా నామకరణం చేశారు. సుదీర్ఘ కాలం ఎమ్మెల్యేగా, మంత్రిగా సేవలందించి అభివృద్ధిలో తనదైన ముద్రవేసుకున్న ఆయన పేరున రాజకీయాలకు అతీతంగా ప్రతిపాదించామని ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి చెప్పారు.

బొలెరో బానెట్‌లో గంజాయి

50 కిలోల స్వాధీనం



పట్టుబడ్డ గంజాయితో నిందితుడు పతివాడ రవికుమార్

కాకినాడ క్రైం: గంజాయి స్మగ్లర్లు పేట్రేగిపోతున్నారు. జిత్తుల మారి ఎత్తులతో గంజాయి తరలింపునకు సరికొత్త మార్గాలు అన్వేషిస్తున్నారు. అధికారుల అప్రమత్తతతో పట్టుబడుతున్నారు. ఈ రీతిలోనే ఓ ముఠా నుంచి కాకినాడ నార్త్ సెబ్ 50 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కాకినాడ గ్రామీణ మండలం తిమ్మాపురం గ్రామ పరిధిలోని వై జంక్షన్ వద్ద ఆదివారం అనుమానాస్పద రీతిలో ప్రయాణిస్తున్న ఓ బొలెరో వాహనాన్ని తనిఖీ చేశారు. ఈ వాహనం బానెట్, సైలెన్సర్‌లలో గంజాయిని నింపి తరలిస్తుండడాన్ని సెబ్ సిబ్బంది గుర్తించారు. ఈ తనిఖీలలో 50 కిలోల గంజాయిని 25 విడి పొట్లాలుగా చుట్టి బానెట్, సైలెన్సర్ ఖాళీలలో నింపారు. అనకాపల్లి జిల్లాకు చెందిన పతివాడ రవికుమార్ గంజాయి తరలిస్తుండగా అతడి నుంచి గంజాయి, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.